జీప్ శబ్దం విని చదువుతున్న పేపర్లోంచి తల బయటకు పెట్టింది జలజ. పోలీస్ యూనిఫాంలో ఉన్న ఆమె భర్త రఘురా మ్ హుషారుగా ఈల వేస్తూ ఇంట్లోకి రాసాగాడు. జలజ కిచెన్‌లోకి వెళ్ళి ఫ్లాస్క్‌లోని కాఫీని కప్‌లోకి వంపి భర్త కందించింది.

"ఏమిటి జలజా విశేషాలు?" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు రఘురాం.

"మీ రీ రోజు పేపర్ చదివారా?" కొద్దిగా ఆందోళన నిండిన కంఠంతో అడిగింది జలజ.

"లేదు. ఏమిటో విశేషం?" అడిగాడు రఘురాం.

జలజ పేపర్‌లోని ఓ వార్తను చూపిస్తూ - "ఇది చదవండి" అంటూ పేపర్‌ను భర్త చేతి కిచ్చింది. రఘురాం చదవసాగాడు.

"నగర శివారులోని ఇందిరానగర్ కాలనీలో దోపిడీ" - అనే శీర్షికతో అంతకు క్రితం రోజు రాత్రి ఆ కాలనీలో జరిగిన దోపిడీ గురించిన వార్త అది. యథాలాపంగా వార్తను చదివిన రఘురాం అందులో పెద్ద విశేషమేం లేనట్లు పేపర్ అవతల పడేయడంతో జలజకు వళ్ళు మండుకొచ్చింది.

"ముఖానికి నల్లరంగు పూసుకుని, పొట్టి నిక్కర్లతో వచ్చారటండీ దొంగలు" అన్నది.

"అవును మరి. కాలనీ ప్రజలు ఎవరికి వారే అన్నట్లుగా ఉంటే మొత్తం కాలనీనే ఏదో ఒక రోజు దొంగలు దోచుకెడతారు" అంటూ కప్ ఖాళీ చేసి టేబిల్‌పై ఉంచాడు రఘురాం.

"అంటే... మీకూ... మీ డిపార్టుమెంటుకూ ఏ బాధ్యతా లేదన్న మాట !" నూటిగా ప్రశ్నించింది జలజ.

"ఎందుకు లేదు? దొంగతనం జరగ్గానే పోలీసు కుక్కల్ని రంగంలోకి దింపి మా ఇన్‌స్పెక్టర్ పరిశోధనలోకి దిగాడు కదా ! దొంగతనం జేసిన ముఠా ప్రస్తుతానికి తప్పించుకున్నా - ఏదో ఒక రోజు పట్టుబడక తప్పదు." చెప్పాడు రఘురాం.

"ఏదో సామెత చెప్పినట్లుంది. మీ డిపార్టుమెంటంతా ఏం జేస్తున్నట్లండీ? నాకు తెలియ కడుగుతాను- దొంగతనాలు, దోపిడీలు జరగకుండా... అరికట్టే బాధ్యత మీ డిపార్టుమెంటుకు లేదా?"

"చెప్పానుగా జలజా ! ప్రజల సహకారం ఉంటే దొంగతనా లనేవి జరగకుండా అరికట్టవచ్చు. ప్రజల్లో సామాజిక స్పృహ, ఐకమత్యం లేనన్ని రోజులూ ఇలాంటివి తప్పవు. ముఖ్యంగా నగరానికి దూరంగా శివార్లలో నివసించే ప్రజలు తవ సమస్యల్ని ఎవరో తీరుస్తారని భావిస్తే అనర్థాలు తప్పవు" - అంటూ చిన్నసైజు లెక్చర్ ఇచ్చాడు రఘురాం.

"ఆట రాక మద్దెల ఓడన్నట్లున్నాయ్ మీ మాటలు. పావం ! దాచుకున్న డబ్బు, నగలు దొంగల పాలై కాలనీ ప్రజ లేడుస్తుంటే మీరు నీతికథలు చెబుతూ కూర్చుంటారన్నమాట" - నిష్ఠురంగా మాట్లాడింది జలజ. రఘురాం చిన్నగా నవ్వుకున్నాడు.

"ఇలాంటి విషయాల్లో నీ కట్టే అనుభవం లేనట్లుంది జలజా ! నే చెప్పేది కాస్త అర్థం చేసుకో" అన్నాడు.

"చాల్లెండి. ఎవరన్నా వింటే నవ్వుతారు. పేరుకు మాత్రం పెద్ద పోలీసాఫీసర్ భార్యను. ఆ దోపిడీ జరిగింది మా ఫ్రెండ్ వాళ్ళ ఇంట్లోనే. వాళ్ళు ఫోన్ చేసి దొంగల్ని ఎలాగైనా పట్టుకోవాలని మరీ నాకు చెప్పారు. వాళ్ళ పక్క ఇంట్లోనే మా అన్నయ్య, వదిన ఉంటున్న విషయం మీరు మరిచిపోయినట్లుంది."

"అలాంటిదేం లేదు జలజా. నేర పరిశోధనలో మా డిపార్టుమెంటు చాలా సమర్థవంతంగా పని చేస్తుంది."

"చాల్లెండి. మీ జోకులు వింటానికి నేనేం తీరిగ్గా



# స్పృహ

అనంతవరం జనార్ధన్



లేను'' అంటూ విసురుగా ఖాళీ కప్పు అందుకుని కిచెన్‌లో కెళ్ళిపోయింది జలజ.

రఘురాం అసహనంగా భార్య వెళ్ళిన వైపే చూస్తూ కూర్చుండిపోయాడు. పోలీస్ ట్రైనింగ్‌లో చెప్పిన పాఠాలు గుర్తు కొచ్చి అతని మదిలో ఓ చిలిపి ఊహ మెదిలింది. అతని పెదవులపైన చిరునవ్వు కదలాడింది. ఓ క్షణంసేపు దోపిడీ జరిగిన ఇందిరా కాలనీ గురించి, తన బావగారి ఇల్లు ఉన్న ప్రాంతాల్ని మననం చేసుకున్నాడు.

"జలజా !" పిలిచాడు రఘురాం. జలజ కిచెన్‌లోంచి వచ్చింది.

"నేను అర్జెంటు పనిమీద ఊ రెడుతున్నాను. రెండ్రోజుల్దాకా రాను. ఇందిరా కాలనీలో ఉన్న మీ అన్నయ్య వాళ్ళింట్లో ఈ రెండు రోజులూ కాలక్షేపం చెయ్'' అన్నాడు రఘురాం.

జలజ ఏదో చెప్పాలని తటపటాయిస్తుండడంతో - "ఏం దొంగ లొస్తారని భయమా?'' అంటూ వెటకారంగా నవ్వాడు రఘురాం.

"ఛ ఛ ! నాకేం భయం ! కాలేజీలో నేనే స్పోర్ట్స్ సెక్రటరీగా ఉండేదాన్ని. తెలుసా?'' అన్నది జలజ గర్వంగా.

"మరి ఏమి టాలోచిస్తున్నావ్?'' అడిగా డతడు.

"మరేం లేదు. అన్నయ్య కోసారి ఫోన్ చేసి నే వస్తున్న విషయం చెప్పాలి'' అంటూ ఫోన్ చేయసాగింది జలజ.

నాగరికతకు ప్రతీకగా రూపొందించిన హౌసింగ్ కాలనీ ఇందిరానగర్. నగరానికి దూరంగా విసిరేసినట్టుగా శబ్ద కాలుష్యానికి దూరంగా, ప్రశాంతతకు చిహ్నంగా గొప్ప పేరు సంపాదించిం దా కాలనీ. అక్కడ నివసించే ప్రజల్లో ఎక్కువ భాగం ఉద్యోగస్థు లవడంతో పగలు కూడా దాదాపు నిర్మానుష్యంగా, మునివాటికలా గోచరిస్తుం దా కాలనీ. ఆ కాలనీ ప్లాన్ గురించి మననం చేసుకోసాగాడు రఘురాం.

ఫోన్లో మాట్లాడిన జలజ రిసీవర్‌ను క్రెడిల్ చేసి హుషారుగా భర్త దగ్గర కొచ్చింది.

"ఏమండోయ్ ! మొన్న మనం మిస్ అయిన హిందీ పిక్చర్ వాళ్ళ కాలనీలో ఆడుతోందిట. నిన్న రాత్రే అన్నయ్య, వదిన చూసేశారుట. నేను ఈ రోజే సెకండ్ షో కెడతాను.'' హుషారుగా చెప్పసాగింది జలజ.

"అలానా ! మరి ఒంటరిగానే సెకండ్‌షో కెడతావా?'' ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి మరీ అడిగాడు.

"నాకేం భయం లేదులెండి. నే నెవర్నో తెలుసుగా? కాలేజీలో స్పోర్ట్స్ సెక్రటరీని.'' రఘురాం వైపు వెక్కిరింపుగా చూస్తూ లోపలకు నడిచింది.

మరో పది నిముషాల తరువాత రెండు సూట్‌కేసుల్తో బయటకు వచ్చింది జలజ.

"ముందుగా నువ్వు ఇందిరా కాలనీలో దిగిపో

